క్లుప్తంగా

అంత్యక్రియలకు వితరణ



వితరణ అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఎటపాక: మండలంలోని గొమ్ముకోయగూడెం, కృష్ణవరం గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం వితరణ అందజేశారు. మండలంలోని గొమ్ముకోయగూడెం గ్రామానికి చెందిన ఉయిక వసంత్, కృష్ణవరం గ్రామంలో కురం నారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. వారి అంత్యక్రియల కోసం ఆయా పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేసేందుకు ట్రస్ట్ ముందుకొచ్చింది. ఈ మేరకు ట్రస్టు నిర్వాహకులు ఆయా బాధిత ఒక్కో కుటుంబానికి రూ.5వేల నగదును అందజేశారు. కణితి మధు, పుట్టి రమేష్, దానె రాజు, రమాదేవి, వెంకన్న తదితరులున్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక



ఎంపీడీవో శ్రీసాయిహర్ష

ముంచంగిపుట్టు: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై మండల కేంద్రంలో గురువారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్ష తెలిపారు. ఈ మేరకు 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులపై మండలంలోని 23 పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించి, గ్రామ సభలు నిర్వహించినట్టు చెప్పారు. తనిఖీల్లో గుర్తించిన అంశాలపై మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యలయం ఆవరణలో జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధి కూలీలు హాజరుకావాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి



బోయిదేవి(ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ డేగలపుట్టు గ్రామ అంగన్‌వాడీ టీచర్ బురిడి బోయిదేవి(56) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ భాగ్యవతి, సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్‌రావు, అంగన్‌వాడీలు, పలు పార్టీలకు చెందిన నేతలు బోయిదేవి మృతదేహానికి నివాళులర్పించారు. గత 30 సంవత్సరాలుగా అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూ, అందరితో మంచిగా ఉండే బోయిదేవి మృతికి పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బోయిదేవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు.

పాలిథిన్ కవర్ల నిషేధంపై ప్రచారం



ప్రచారంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని బుధవారం జరిగిన వారపు సంతలో పాలిథిన్ కవర్ల నిషేధంపై ఎంపీడీవో శ్రీనివాసరావు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ డిసెంబర్ 1 నుంచి పాలిథిన్ కవర్లు వాడకాన్ని పూర్తిగా నిషేధించారని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇకపై దుకాణాలలో పాలిథిన్ కవర్లు వాడకాన్ని జరిపితే రూ. 500 నుంచి రూ.1000 వరకు జరిమానా విధించి నోటీసులు అందజేస్తామని హెచ్చరించారు. సర్పంచ్ దురియా పుష్పలత ,కార్యదర్శి శ్రీధర్ ,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

గూడెం కొత్తవీధి: పట్టా ఉన్న ప్రతీ రైతు విధిగా ఈ-కేవైసీ చేసుకోవాలని ఏవో మదుసూధన్ రావు కోరారు. మండలంలోని అమ్మవారి ధార కొండ పంచాయతీ గొల్లపల్లిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది బలరాం, సంధ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

- పొట్టకూటి కోసం పయనం
- మైదాన ప్రాంతాలకు తరలిపోతున్న గిరిజనం
- 'ఉపాధి' కల్పించని కూటమి ప్రభుత్వం

ఉపాధి వేట... వలస బాట



ఉపాధి పనుల కోసం మైదాన ప్రాంతాలకు తరలివెళ్తున్న గిరిజన యువత



ఉపాధి పనులు లేక గ్రామాన్ని వదిలివెళ్తున్న యువకులు

చింతపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో కనీస ఉపాధి సౌకర్యాలు లేక అనేకమంది ఆదివాసీ గిరిజన కుటుంబాలు మైదాన ప్రాంతాలకు తరలిపోతున్నారు. ప్రస్తుతం ఈ సీజన్‌లో వరి కోతలు, కాఫీ పండ్ల సేకరణ వంటి పనులు తప్పితే ఎటువంటి కూలీ పనులు దొరికే పరిస్థితి లేకపోవడంతో ఈ ప్రాంత గిరిజనులు కూలీ పనులకు వలస పోతున్నారు. గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల పరిధిలో అత్యంత మారుమూల పంచాయతీల గ్రామాల్లో నేటికి కనీస ఉపాధి సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివాసీ గ్రామాల్లో పోడు వ్యవసాయమే జీవనాధారంగా జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రస్తుత కాలంలో అకాల వర్షాలు, తుపానులతో వారు పండించే రాగులు, సామలు, కొర్రలు, కొండకందులు, జొన్నలు వంటి వాణిజ్య పంటలు సక్రమంగా పండక రైతులు ఆర్థికంగా నష్టపోయి జీవనాధారం కోసం మైదాన ప్రాంతాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

జీవనాధారం కోసం

ఈ వలసల్లో భాగంగానే కొయ్యూరు మండలం మఠం భీమవరం పంచాయతీ పరిధిలో గల మండపల్లి గ్రామం, గూడెం కొత్తవీధి మండలం జి.కొత్తపల్లి గ్రామాలకు చెందిన సుమారు 40 కుటుంబాల గిరిజన కుటుంబాలకు చెందిన యువతీ, యువకులతో పాటు ఆదివాసీ గిరిజన కుటుంబాలు రోజువారీ కూలలి పనుల కోసం తూర్పు గోదావరి జిల్లాకు లగేజి సర్దుకొని తరలిపోతున్నారు. ఈ ప్రాంతంలో రెండు మూడు గ్రామాల కూలీలను నమకూర్చి ఒకేసారి మైదాన ప్రాంతాలకు తీసుకువెళ్లే విధంగా కాంట్రాక్టర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ నుంచి తీసుకెళ్లిన కూలీలకు వరి కోత పనులు అప్పజెప్పి కాంట్రాక్టు రూపంలో వారికి సొమ్ము చెల్లించడం జరుగుతుందని చెబుతున్నారు. కేవలం తమ గ్రామాల్లో ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకపోవడంతోనే వలస వెళ్లాల్సి వస్తోందని వలసదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కాఫీ తోటలు ఉన్నా ఈ ఏడాది పంట దిగుబడికి రాక, కనీసం తమ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పన లేక వలస పోతున్నామని కొయ్యూరు మండలం మఠం భీమవరం పంచాయతీ మండిపల్లికి చెందిన పలువురు గిరిజనులు చెబుతున్నారు. సొంతూరు గత్యంతరం లేక బతుకు సాగించడానికి కూలీ పనులకై మైదాన ప్రాంతాలకు తరలిపోవాల్సి వస్తుందని గూడెం కొత్తవీధి మండలం జి.కొత్తపల్లి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన వలస వెళ్తున్న వారిలో 20 నుండి 25 సంవత్సరాలు గల యువతే ఎక్కువగా ఉన్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా ఎన్నో గ్రామాల నుంచి ఉపాధి సౌకర్యాలు లేక జీవనోపాధికై మైదాన ప్రాంతాలకు తరలిపోవాల్సిన పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని పలు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏపీవో రాజుబాబు మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామ సభలు ఏర్పాటుచేసి గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధి లేక వలస పోతున్నాం



మా గ్రామంలో 30 ఆదివాసీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాం. మా కుటుంబాలన్నీ ఆధారపడ్డ కాఫీ పంట ఈ ఏడాది పూర్తిగా దెబ్బతింది. ఇప్పటి వరకు మా గ్రామంలో కనీసం పాఠశాల కూడా లేదు. జాబు కార్డులు లేవు. మా తల్లిదండ్రులు గ్రామం వదిలి రాలేరు. వారిని పోషించుకోవడంతో పాటు మా బతుకు సాగించడానికి కూలీ పనులకు వలస పోతున్నాం.

– డిప్పల విజయశాంతి, మండిపల్లిగ్రామం, కొయ్యూరు మండలం.

జాబు కార్డులున్నా ప్రయోజనం లేదు



మా గ్రామంలో 25 కుటుంబాలు పోడు వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్నాం.ఈ సంవత్సరం ఆదాయాన్నిచ్చే కందులు, సామలు, రాగులు తదితర పంటలన్నీ వర్షాభావంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం ద్వారా గ్రామంలో జాబు కార్డులు మంజూరు చేసినా పనులు కల్పించలేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో మైదాన ప్రాంతానికి కూలీ పనులకై వలస పోవాల్సి వస్తుంది.

– పాంగి రమేష్, జి.కొత్తపల్లి గ్రామం, జీకే వీధి మండలం

విద్యా సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బాబూరావు పడాల్

జి.మాడుగుల: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంఈవో సీహెచ్.బాబూరావుపడాల్ ఆదేశించారు. డిసెంబర్ 3న నిర్వహించనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న కార్యక్రమాలపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచర్లు, భవిత కేంద్రాల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఈఆర్‌పీఎస్ పాఠశాల హెచ్‌ఎం, పాఠశాల టీచర్లకు శిక్షణ ఇవ్వటం జరిగిందని ఆయన అన్నారు. మండలంలో గల ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు(సీడబ్ల్యుస్ఎన్) నిర్వహించారు.క్యారమ్స్, చెస్, డ్రాయింగ్, రన్నింగ్ తదితర ఆటలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు కృషి



సూచనలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ, అసరాడ గ్రామాల్లో తహసీల్దార్ రామకృష్ణ బుధవారం పర్యటించారు. రింతాడ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. అనంతరం గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేపై గ్రామసభలు నిర్వహించారు.

రగ్గుల పంపిణీ



జాతీయ రహదారి నిర్మాణ కార్మికులకు రగ్గులు పంపిణీ చేస్తున్న దాత సత్యనారాయణ



అడ్డతీగలలో రగ్గులు పంపిణీ చేస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ వెంకయ్య

అడ్డతీగల: మండలంలోని వీరవరం పంచాయతీలోని అమరలంకలో సీఐ బి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో కమ్యునిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రగ్గులు, యువతకు వాలీబాల్ కిట్లు, చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. దుప్పులపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దుశ్చర్తి ఎస్ఐ వెంకయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లిలో 516 జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న కార్మికులకు రెవెన్యూ ఉద్యోగి సత్యనారాయణ రగ్గులు దుప్పట్లు వితరణగా అందజేశారు. రహదారి నిర్మాణ పనుల్లో కూలీలుగా పనిచేయడానికి మధ్యప్రదేశ్ నుంచి ఈ వచ్చిన సుమారు 30 కుటుంబాల కూలీలు చింతపల్లి సమీపంలో గల చిన్నగెడ్డలో గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత అధికం కావడంతో ఆ కుటుంబాలకు బుధవారం రెవెన్యూ ఉద్యోగి సత్యనారాయణ దుప్పట్లు రగ్గులు పంపినీ చేశారు. కొర్రా సుధీర్, దుమ్మంతి భవాని, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదుపై సూచనలు



అడ్డతీల ఎంఆర్‌సీలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు



వేములోవ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

అడ్డతీగల: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం(ఎంఆర్‌సీ)లో బుధవారం జరిగిన కార్యక్రమంలో అపార్ నమోదుపై ఉపాధ్యాయులకు ఎంఈవో పి.శ్రీనివాసరావు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అపార్ ఐడి రిజిస్ట్రేషన్‌లో నిబంధనలు పాటించాలన్నారు. విద్యార్థుల ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలలోని వివరాలను సరిచూసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆన్‌లైన్ అటెండెన్స్ నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

గంగవరం : వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఎంపీడీఓ పిజి రామకృష్ణ బుధవారం సందర్శించారు. పాఠశాల ఆవరణను, వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం అపార్ నమోదుపై పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించి తగిన సూచనలిచ్చారు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ, పేరు తప్పులుగా నమోదైనట్టు సిబ్బంది ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కరించడానికి సచివాలయానికి తగిన సూచనలిస్తామని సమస్య పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనచోదకులకు సూచనలిస్తున్న సీఐ వినోద్‌బాబు

చింతపల్లి: మండల కేంద్రంలోని వాహనచోదకులకు సీఐ వినోద్ బాబు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం, నిబంధనలు పాటించకపోవడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి వాహనదారులు పక్కాగా అని రికార్డులను సరిచూసుకోవాలన్నారు. ఎస్ఐ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగించండి



వ్యాపారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెట్టి పాదచారులకు ఇబ్బందులు కలిగించొద్దని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన బుధవారం పర్యటించారు. ఫుట్‌పాత్ ఉన్న దుకాణాలు, సామన్లు తొలగించాలని సూచించారు. రోడ్డుపై దుకాణాలు పెట్టొద్దని, ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పాంగి చిన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణకుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెద్దం నర్సింగరావు, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పంచాడి తిరుపతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాది రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలో ఏసురాజుకు తృతీయ స్థానం



ఏసురాజును అభినందిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ, పీడీ అదయ్య

గంగవరం : రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో స్థానిక గిరిజన సంక్షేమ బాలురు ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న పి.ఏసురాజ్ తృతీయ స్థానాన్ని సాధించాడు . గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన స్వాభిమాన్–2024 ఉత్సవాల్లో తమ పాఠశాల విద్యార్థి పి.ఏసురాజు రంపచోడవరం ఐటీడీఏ తరుపున రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.వి.వి.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థి ఏసు రాజును ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఎంఈవో టి.మల్లేశ్వరరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. నందించారు.

కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు



చుట్టుగొంది వద్ద కల్వర్టు మరమ్మతు పనులు

ముంచంగిపుట్టు: మండలంలో బుంగాపుట్టు పంచాయతీ చుట్టుగొంది గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు వరదలకు కొట్టుకుపోయింది. దీంతో మూడు నెలలుగా చుట్టుగొంది గ్రామ గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు సర్పంచ్ నోబిన, వైఎస్సార్‌సీపీ నేత సుకదేవ్, వార్డు మెంబర్ గోపాల్‌లు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చోరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా సొంత నిధులతో పొక్లెయిన్‌ను ఏర్పాటుచేసి కోతకు గురైన కల్వర్టు ప్రదేశంలో మట్టితో పూడ్చి తాత్కాలికంగా రాకపోకలు జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో చుట్టుగొంది గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నోబిన మాట్లాడుతూ చుట్టుగొంది గ్రామంలో కల్వర్టు కొట్టుకు పోయి నెలలు గడుస్తున్నా, అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరారు.

పిడతమామిడి పీహెచ్‌సీకి కాయకల్ప అవార్డు



సంబరాలు జరుపుకుంటున్న సిబ్బంది

గంగవరం: మార్గదర్శకాలకు అనుగుణంగా ఆస్పత్రుల్లో ఉత్తమ సేవలు, ఆరోగ్య సౌకర్యాలు తదితర అంశాలపై నిర్వహించిన సర్వేలో గుర్తింపు పొందిన వైద్యాలయాలకు ప్రభుత్వం కాయకల్ప అవార్డులను ప్రకటించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో రెండో స్థానంలో గంగవరం మండలం పిడతమామిడి పీహెచ్‌సీ నిలిచింది. పీహెచ్‌సీకి అవార్డు దక్కడం ఆనందంగా ఉందని, వైద్యాధికారి డాక్టర్ సాయి రతన్ చెప్పారు.సిబ్బంది సంబరాలు జరుపుకున్నారు.

సత్వరమే కల్వర్టు పనులు పూర్తి చేయాలి

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయితీ రాత్తులపుట్టు గ్రామ సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులను బుధవారం సీపీఎం నేతలు పరిశీలించారు. కల్వర్టుకు అనుకొని రెండు వైపులా రక్షణ గోడలు నిర్మించకుండా పనులను అసంపూర్తిగా ఉండడాన్ని నేతలు గమనించారు. ఈ సందర్భంగా నేతలు త్రినాథ్, గాసిరాందొర, రామదాసులు మాట్లాడుతూ రాత్తులపుట్టు కల్వర్టు పనులను అసంపూర్తిగా చేసి కాంట్రాక్టర్ బిల్లులు మార్చుకున్నారని ఆరోపించారు.

అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టానుసారంగా కాంట్రాక్టర్ పనులు చేశారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కల్వర్టుకు రెండు వైపులా రక్షణ గోడలు నిర్మించాలన్నారు. లేని పక్షన స్థానిక గిరిజనులతో ఆందోళన కార్యక్రమం చేస్తామని వారు హెచ్చరించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



కూరగాయల రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌వో శిరీష, వ్యవసాయ అధికారి నీలవేణి



కిలగాడలో సూచనలిస్తున్న ఉద్యానవన అధికారి శరణ్య



చింతకర్రపాలెంలో పాల్గొన్న వ్యవసాయశాఖ ఏవో ఉషారాణి



రాజవొమ్మంగిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో చక్రధర్

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా పంచాయతీ దేముడువలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో నీలవేణి, హార్టికల్చర్ అధికారి శిరీష పాల్గొన్నారు. పంటలను పరిశీలించి, రైతులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సిబ్బంది రాములమ్మ, సంజీవిని సంస్థ డైరెక్టర్ దేవుళ్ల పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ, బంగారు మెట్ట పంచాయతీల్లో పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఉద్యాన వనశాఖాధికారి శరణ్య మాధురి మాట్లాడుతూ పసుపు సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. పశు వైద్యాధికారి సౌజన్యదేవి, సర్పంచ్ శివశంకర్, వ్యవసాయాధికారి విజయలక్ష్మీ, పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని చింతకర్రపాలెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ఉషారాణి వరి పంటకు సోకే తెగుళ్ల నివారణకు సూచించారు.

గంగవరం: మండలంలోని చింతకర్రపాలెం, సూరంపాలెంలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్ మాట్లాడుతూ పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్‌లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యకమంలో మండల వ్యవసాయాధికారి చక్రధర్ మాట్లాడుతూ తుపాను హెచ్చరికల నేపథ్యంలో పంటలను భద్రపరచుకోవాలన్నారు. ఏఈఓ భవాని, వీఏఏలు సతీష్, భరద్వాజ్ తదతరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశుగణన సర్వే



లంబసింగిలో పశుగణన సర్వే చేస్తున్న వైద్యాధికారి షాలిని

చింతపల్లి: లంబసింగి జంక్షన్‌లో పశు వైద్యాధికారి చల్లంగి షాలిని ఆధ్వర్యంలో బుధవారం పశుగణన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఇళ్లలో పెంచుకుంటున్న కోళ్లు, మేకలు, ఆవులు, గేదెలు, పెంపుడు జంతువుల వివరాలను నమోదు చేస్తామన్నారు. సర్వే ఆధారంగా గిరిజన రైతులకు అవసరమైన వ్యాక్సిన్‌లు, మందులుతో పాటు ప్రభుత్వపరంగా రాయితీలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామస్తులు సర్వేకు సహకరించాలని కోరారు.

రైతులకు సూచనలు



కొయ్యూరులో వరి నూర్పిళ్లను పరిశీలిస్తున్న ఏవో ఉమాదేవి



రాజవొమ్మంగిలో వరి కోతలు చేస్తున్న రైతులు

కొయ్యూరు/గంగవరం/చింతూరు/రాజవొమ్మంగి: వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొయ్యూరు, గంగవరం, చింతూరు, రాజవొమ్మంగి మండలాల ఏవోలు పంటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలిచ్చారు. పనల మీద ఉన్న పంటను వెంటనే కుప్పలుగా పోసి తడవకుండా వాటిపై తాటాకులు, టార్పాలిన్లు కప్పుకోవాలని ఆయన సూచించారు. కుప్పల వద్ద వర్షపునీరు నిలువ వుండకుండా కాలువలు చేసుకోవాలన్నారు. పంటకు నూర్పిళ్లు చేసుకోవాలని సూచించారు. త్వరితగతిన కోతలు చేయాలన్నారు. గింజలు మొలకెత్తకుండా, పాడవకుండా లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కొయ్యూరు, గంగవరం, చింతూరు, రాజవొమ్మంగి మండలాల వ్యవసాయాధికారులు ఉమాదేవి, విశ్వనాథ్, శ్రీనివాసరావు, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు. చింతూరు మండలంలోని 400 హెక్టార్లలో వరి కోయగా 300 హెక్టార్ల వరిని కుప్పలుగా వేశారని, మరో 100 హెక్టార్ల వరి పనలపై ఉన్నట్టు ఏవో శ్రీనివాసరావు ఆయన తెలిపారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు: పాడేరులో డిసెంబర్ 4, 5 తేదీల్లో సీపీఎం మహాసభలను నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స చెప్పారు. ఈ మేరకు పాడేరులో బుధవారం జరిగిన కార్యక్రమంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ అమలుకాని అంశంతో పాటు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చిస్తామన్నారు. సభకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం ముఖ్య అతిథిగా హాజరవుతారని, పార్టీ నాయకులు తరలివచ్చిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.